


తెలుగు జాతీయ దినపత్రిక
అక్షర
# విజేత
నిజం నిర్భయం నిష్పక్షం
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక




ఆంధ్రప్రదేశ్ సంపుటి:05 సంచిక :122 ఎడిటర్ : బి. అనిల్ కుమార్ పేజిలు : 10, వెల. 6రూ/ శుక్రవారం 27 ఫిబ్రవరి 2026

పోలవరం-నల్లమల అనుసంధానంతో

# రెండు రాష్ట్రాలకూ లాభమే

-ఆ ప్రాజెక్టుతో ఏ రాష్ట్రానికీ నష్టం లేదు: సీఎం చంద్రబాబు
-వచ్చే ఏడాది మే 15 నుంచే నారుమళ్లకు నీరందించేలా ప్రణాళికలు సిద్ధం
-నీళ్లు రాకుండానే వెలిగొండకు రిబ్బన్ కట్ చేసి గత పాలకులు క్రెడిట్ కొట్టేశారు
-రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులపై త్వరలోనే బ్లూప్రింట్ విడుదల చేస్తామని వెల్లడి
-ప్రతి ఎకరాకు నీరందించి తెలుగు తల్లికి జలహారతి ఇవ్వడమే లక్ష్యమని స్పష్టీకరణ
-శాసనసభలో సాగునీటి రంగంపై జరిగిన చర్చలో చంద్రబాబు ప్రసంగం


2

పోలవరం-నల్లమల సాగర్ అనుసంధాన ప్రాజెక్టుతో ఏ రాష్ట్రానికీ నష్టం జరగదని, దీనిపై పొరుగు రాష్ట్రం అభ్యంతరాలు వ్యక్తం చేయాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. వృథాగా సముద్రంలోకి పోతున్న గోదావరి వరద జలాలను మాత్రమే ఈ ప్రాజెక్టు ద్వారా తరలిస్తామని ఆయన శాసనసభలో వివరించారు. గోదావరిపై ఎగువ రాష్ట్రం కాళేశ్వరం ప్రాజెక్టు కట్టినప్పుడు తాము ఎన్నడూ అభ్యంతరం చెప్పలేదని గుర్తుచేశారు. ఈ అనుసంధాన ప్రాజెక్టు వల్ల రెండు తెలుగు రాష్ట్రాలకూ మేలు జరుగుతుందని ఆయన అన్నారు. గురువారం నాడు శాసనసభలో సాగునీటి రంగంపై జరిగిన చర్చలో ముఖ్యమంత్రి ప్రసంగించారు.

# ఇజ్రాయెల్ టెక్నాలజీపై ప్రధాని మోదీ దృష్టి..

## భారత్-ఇజ్రాయెల్ బంధం మరింత బలోపేతం

భారత్‌లో పెట్టుబడులు, తయారీ కోసం ముందుకు రావాలని ఇజ్రాయెల్ కంపెనీలకు మోదీ ఆహ్వానం
ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో కలిసి అక్కడి టెక్నాలజీ ప్రదర్శనను సందర్శించిన మోదీ
వ్యవసాయం, నీటి నిర్వహణ, ఆరోగ్యం వంటి రంగాల్లో సహకారానికి విస్తృత అవకాశాలున్నాయని వెల్లడి
గాలి నుంచి నీరు, రోడ్డు ప్రమాదాల నివారణ వంటి టెక్నాలజీలను పరిశీలించిన ప్రధాని

భారతదేశంలో పెట్టుబడులు పెట్టడానికి, తయారీ యూనిట్లు స్థాపించడానికి, సాంకేతిక భాగస్వామ్యాలు నిర్మించుకోవడానికి ఉన్న అపార అవకాశాలను అందిపుచ్చుకోవాలని ప్రధాని మోదీ ఇజ్రాయెల్ కంపెనీలను ఆహ్వానించారు. గురువారం ఆయన ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో కలిసి ఇజ్రాయెల్‌లో ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక టెక్నాలజీ ప్రదర్శనను సందర్శించారు. ఈ సందర్భంగా మోదీ ఈ పిలుపునిచ్చారు.


2

పేదవాళ్ల ఇళ్లను కూలుస్తూ..

# వేల కోట్లతో పార్కులా?

: రేవంత్ సర్కార్‌పై ఈటల ధ్వజం
మూసీ ప్రక్షాళన పేరుతో వందలాది ఇళ్లను నేలమట్టం చేస్తున్నారని ఈటల మండిపాటు
పేదలకు కొత్తగా ఒక్క ఇల్లు కూడా ఇవ్వకపోగా, ఉన్న నీడను లాక్కుంటున్నారని విమర్శ
ఈ పరిణామాలపై రాహుల్ గాంధీ స్పందించాలని డిమాండ్


2

# ఘటనలు జరిగాక స్పందిస్తే ప్రయోజనం లేదు

## అధికారులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

-శ్రీకాకుళం, రాజమండ్రి ఘటనలపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష
-బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించిన ముఖ్యమంత్రి-ముందస్తు నివారణే ముఖ్యమని స్పష్టీకరణ
-క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేసి యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలని కలెక్టర్లకు సూచన
-బాధితులకు అందుతున్న వైద్య సాయం, క్షేత్రస్థాయి పరిస్థితులపై ఆరా తీసిన సీఎం

శ్రీకాకుళం పట్టణంలో కలుషిత తాగునీటి కారణంగా డయేరియా ప్రబలడం, రాజమండ్రిలో కల్తీ పాల వల్ల పలువురు ప్రాణాలు కోల్పోవడం వంటి తీవ్రమైన ఘటనలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో మున్సిపల్, వైద్యారోగ్య శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ రెండు విషాద ఘటనల్లో ప్రజల ప్రాణాలు పోవడానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఏమాత్రం ఉపేక్షించవద్దని అధికారులను తీవ్రంగా హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చూడటమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం కావాలని స్పష్టం చేశారు.

ముందస్తు చర్యలే ముఖ్యం: సీఎం చంద్రబాబు

2


‘కేరళ స్టోరీ 2‘ విడుదలకు

# బ్రేక్..

## 15 రోజులు స్టే విధించిన హైకోర్టు

రెండు వారాల పాటు విడుదల వాయిదా
కేరళ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు



2

# కేటీఆర్, హరీశ్‌రావువి అన్నీ అబద్ధాలే:

## కాళేశ్వరం వైఫల్యాలపై మంత్రి పొంగులేటి

ప్రాజెక్టులపై కేటీఆర్, హరీశ్ వ్యాఖ్యలు వాస్తవ దూరమన్న పొంగులేటి
లక్ష కోట్లు ఖర్చు చేసినా ఫలితం శూన్యమని విమర్శ
రాష్ట్ర నీటి ప్రయోజనాల విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని వ్యాఖ్య


గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టుల పేరుతో అవకతవకలు జరిగాయంటూ రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ధ్వజమెత్తారు. లక్ష కోట్లు ఖర్చు చేసినా ఫలితం శూన్యమని విమర్శించారు. ప్రాజెక్టులపై మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు చేస్తున్న వ్యాఖ్యలు వాస్తవ దూరమని, ప్రజలను తప్పుదోవ పట్టించడమే వారి లక్ష్యమని ఆయన ఆక్షేపించారు

2


ఇక ఇజ్రాయెల్ లోనూ

# మన యూపీఐ సేవలు

-ఇజ్రాయెల్‌లో యూపీఐ సేవలు అందుబాటులోకి
-ప్రధాని మోదీ పర్యటనలో కుదిరిన కీలక ఒప్పందం
-వేగంగా, చౌకగా మారనున్న డిజిటల్ లావాదేవీలు
-క్రిటికల్ టెక్నాలజీ రంగాల్లోనూ భాగస్వామ్యానికి నిర్ణయం
-ఇప్పటికే 8కి పైగా దేశాల్లో యూపీఐ సేవలు



2

జగన్ చేతకానితనం వల్లే

# సీమ లిఫ్ట్ ఆగింది

రాయలసీమ ఎత్తిపోతల పథకంపై శాసనమండలిలో తీవ్ర వాగ్వాదం
వైసీపీ హయాంలోనే పనులు ఆగిపోయాయని మంత్రులు నిమ్మల, పయ్యావుల వెల్లడి
సీమకు ఐదేళ్లలో జగన్ చేసిందేమీ లేదని, ఆయనో రాయలసీమ ద్రోహి అని విమర్శ
తమ ప్రభుత్వ హయాంలో సీమ ప్రాజెక్టులకు భారీగా నిధులు కేటాయించామన్న మంత్రులు
ఎన్జీటీ ఆదేశాలను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని తీవ్ర ఆరోపణలు

శాసనమండలిలో రాయలసీమ ఎత్తిపోతల పథకం (రాయలసీమ లిఫ్ట్) అంశంపై అధికార, విపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలోనే నిలిచిపోయిన ఈ ప్రాజెక్టుపై ఇప్పుడు తమను ప్రశ్నించడం ఏంటని కూటమి ప్రభుత్వ మంత్రులు వైసీపీ సభ్యులపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నాలుగేళ్ల పాటు ఆగిపోయిన పనులకు సమాధానం చెప్పకుండా, ఇప్పుడు ప్రభుత్వంపై బురద చల్లడమేంటని నిలదీశారు.

2


# -పోలవరం-నల్లమల అనుసంధానంతో రెండు రాష్ట్రాలకూ లాభమే

మే 15కే నారుమళ్లకు నీళ్లు

రాష్ట్రంలో నీటి భద్రతకు కూటమి ప్రభుత్వం దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకెళుతోందని చంద్రబాబు తెలిపారు. 2047 స్వర్ణాంధ్ర విజన్‌లో భాగంగా నీటి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, పరిశ్రమలు, పెట్టుబడులకు నీరే కీలకమని అన్నారు. రాష్ట్రంలోని జలాశయాల్లో ప్రస్తుతం 793 టీఎంసీల నీరు నిల్వ ఉందని, అందుకే ఈసారి పంటల సీజన్‌ను ముందుకు జరిపి, వచ్చే ఏడాది మే 15 నుంచే నారుమళ్లకు నీరందించేలా ప్రణాళిక రచించామని ప్రకటించారు. ఈ విషయంపై రైతులను చైతన్యవంతం చేయాలని ప్రజాప్రతినిధులకు ఆయన సూచించారు. ప్రతి ఎకరాకు నీరందించి తెలుగు తల్లికి జలహారతి ఇవ్వడమే తన లక్ష్యమని, దీనికోసం రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పూర్తిపై త్వరలోనే ఒక బ్లూప్రింట్ విడుదల చేస్తామని వెల్లడించారు.

ప్రాజెక్టులన్నీ మా హయాంలో కట్టినవే

రాష్ట్రంలో నిర్మించిన ప్రాజెక్టులన్నీ తమ హయాంలోనివేనని చంద్రబాబు స్పష్టం చేశారు. 2014-19 మధ్య సాగునీటి రంగానికి రూ.68 వేల కోట్లు ఖర్చు చేశామని గుర్తుచేశారు. ఎన్టీఆర్ హయాంలోనే రాయలసీమకు తెలుగు గంగ, గాలేరు నగరి, హంద్రీనీవా వంటి ప్రాజెక్టులు వచ్చాయని, తాము పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీళ్లిచ్చి, శ్రీశైలంలో 100 టీఎంసీలు రాయలసీమకు తరలించామని వివరించారు. అందుకే ఆ ప్రాంతం నేడు రతనాల సీమగా మారుతోందన్నారు.

వెలిగొండపై గత పాలకుల క్రెడిట్ చోరీ

గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. వెలిగొండ ప్రాజెక్టుకు నీళ్లు రాకుండానే రిబ్బన్ కట్ చేసి క్రెడిట్ కొట్టేసే ప్రయత్నం చేశారని ఎద్దేవా చేశారు. 30 ఏళ్ల క్రితం శంకుస్థాపన చేసిన ఆ ప్రాజెక్టు మొదటి దశను ఈ ఏడాది జూలైలోనే పూర్తి చేసి నీళ్లిస్తామని హామీ ఇచ్చారు. ప్రాజెక్టు పూర్తికి మరో రూ.2500 కోట్లు అవసరమని, ఇప్పటికే ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులకు రూ.456 కోట్లతో శంకుస్థాపన చేశామని తెలిపారు. అదేవిధంగా కుప్పం కాలువలో ట్యాంకర్లతో నీళ్లు పోసి ప్రచారం చేసుకున్నారని విమర్శించారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును విధ్వంసం చేసి డయాఫ్రాం వాల్‌ను గోదావరిలో కలిపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ప్రాజెక్టును మళ్లీ పరుగులు పెట్టించి పుష్కరాల కంటే ముందే పూర్తి చేస్తామన్నారు.

ప్రాజెక్టుల్లో పుష్కలంగా నీరు

ప్రస్తుతం రాష్ట్రంలోని జలాశయాలు 793 టీఎంసీల నీటితో కళకళలాడుతున్నాయని సీఎం తెలిపారు. జల సంరక్షణ చర్యల వల్ల రాష్ట్రవ్యాప్తంగా భూగర్భ జలాలు సగటున 6 మీటర్లు పెరిగాయని, దీనివల్ల రూ.91 కోట్ల విద్యుత్ ఆదా అయిందని వివరించారు. తాను చేయని తప్పుకు 53 రోజులు జైల్లో పెట్టారని, అయినా రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు నీరివ్వాలన్న సంకల్పంతో పనిచేస్తున్నానని అన్నారు. నీటి భద్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని, కొందరు కేవలం రాజకీయం కోసమే నీటి సమస్యలను సృష్టిస్తున్నారని విమర్శించారు. ప్రతి ఇంటికీ తాగునీరు, ప్రతి ఎకరాకు సాగునీరు, పరిశ్రమలకు నీరు అందించడమే లక్ష్యంగా ముందుకెళతామని చంద్రబాబు పునరుద్ఘాటించారు.

# ఘటనలు జరిగాక స్పందిస్తే ప్రయోజనం లేదు

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. "ఘటన జరిగాక స్పందించడం వల్ల పెద్దగా ఉపయోగం ఉండదు. ముందస్తు పర్యవేక్షణ, అప్రమత్తత ద్వారా ఈ తరహా ఘటనలు జరగకుండా చూడాలి. శ్రీకాకుళంలో తాగునీరు కలుషితమైన ఘటనలో ముందస్తు తనిఖీలు జరిగి ఉంటే ఈ సమస్య వచ్చేదే కాదు" అని అభిప్రాయపడ్డారు. జిల్లా కలెక్టర్లు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేపట్టడం ద్వారా ఇలాంటి ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు.

ప్రతి ప్రభుత్వ విభాగంలో కింది స్థాయి యంత్రాంగాన్ని క్రియాశీలం చేసేందుకు, క్షేత్రస్థాయిలో పరిస్థితులను తెలుసుకునేందుకు ప్రతి అధికారి విధిగా పర్యటించాలన్నారు. ఒక్కో సందర్భంలో ఒక్కో శాఖపై ఆకస్మిక తనిఖీకి వెళ్లడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయని, కిందిస్థాయి అధికారులతో పాటు సంబంధిత శాఖల్లో జవాబుదారీతనం పెరుగుతుందని చంద్రబాబు స్పష్టం చేశారు. కలెక్టర్లు అంటే నిత్యం ప్రజల్లోనే ఉండాలని, అప్పుడే రాష్ట్ర స్థాయిలో అనుకున్న మార్పును తీసుకురాగలమని ఆయన పేర్కొన్నారు.

శ్రీకాకుళంలో 107 మందికి చికిత్స: కలెక్టర్

సమీక్షలో భాగంగా శ్రీకాకుళం జిల్లా కలెక్టర్, ఆన్‌లైన్ ద్వారా మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుత పరిస్థితులను సీఎంకు వివరించారు. "జిల్లాలో ఇప్పటి వరకు 129 డయేరియా కేసులు నమోదు కాగా, ప్రస్తుతం 107 మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. 20 మంది కోలుకుని డిశ్చార్జ్ అయ్యారు. ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ద్వారా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. పైపుల ద్వారా నీటి సరఫరాను నిలిపివేసి, ట్యాంకర్ల ద్వారా సురక్షితమైన నీటిని అందిస్తున్నాం. నాలుగు ఇంజనీరింగ్ బృందాలు 40 లీకులను గుర్తించి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేస్తున్నారు. 150 మంది సిబ్బంది, 7 జేసీబీలు, 10 ట్రాక్టర్లతో పారిశుద్ధ్య పనులు చేపట్టాం. విశాఖ నుంచి మొబైల్ టెస్టింగ్ ల్యాబ్‌ను తరలిస్తున్నాం. ప్రభావిత ప్రాంతాల్లో 24 గంటలూ పనిచేసేలా మెడికల్ క్యాంపులు, ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేశాం" అని తెలిపారు.

స్థానికులు వాటర్ ట్యాంకులు శుభ్రం చేసుకోకపోవడం, పైప్‌లైన్లు డ్రైన్లను క్రాస్ అవ్వడం, నీటి ప్రెజర్ లేకపోవడంతో మోటార్లు పెట్టి నీటిని తోడటం వల్ల కలుషిత నీరు ఇళ్లకు చేరిందని ప్రాథమికంగా గుర్తించినట్లు అధికారులు వివరించారు.

రాజమండ్రి ఘటనలో 8 మంది పరిస్థితి విషమం

అనంతరం రాజమండ్రి కల్తీ పాల ఘటనపై తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి సీఎంకు వివరాలు అందించారు. "ఈ నెల 22న వెలుగులోకి వచ్చిన ఈ ఘటనలో 20 మంది అనారోగ్యం పాలుకాగా, ఐదుగురు మృతి చెందారు. మరో 15 మంది ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుండగా, వారిలో 8 మంది పరిస్థితి ఇంకా విషమంగానే ఉంది. ప్రభావిత ప్రాంతాల్లో 9 వైద్య బృందాలు పనిచేస్తున్నాయి. 957 మందిని నిత్యం పర్యవేక్షిస్తున్నాం. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించాం. నిందితుడైన పాల సరఫరాదారు గణేశ్వరరావును అరెస్ట్ చేసి విచారిస్తున్నాం. బాధితుల ప్రాణాలు కాపాడేందుకు ఇతర ప్రాంతాల నుంచి వైద్య నిపుణులను, పరికరాలను తెప్పించి మెరుగైన చికిత్స అందిస్తున్నాం" అని కలెక్టర్ వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారని అధికారులు తెలిపారు.

ఈ సమీక్షలో మంత్రులు నారాయణ, కొండపల్లి శ్రీనివాస్, నిమ్మల రామానాయుడు, ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఆన్‌లైన్ ద్వారా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, శ్రీకాకుళం, రాజమండ్రి ఎమ్మెల్యేలు, రెండు జిల్లాల ఎస్పీలు కూడా పాల్గొన్నారు.

# 'కేరళ స్టోరీ 2' విడుదలకు బ్రేక్..

వివాదాస్పద చిత్రం 'కేరళ స్టోరీ 2' విడుదలకు కేరళ హైకోర్టు బ్రేక్ వేసింది. రేపు (ఫిబ్రవరి 27) శుక్రవారం థియేటర్లలోకి రావాల్సిన ఈ సినిమా విడుదలను 15 రోజుల పాటు నిలిపివేస్తూ గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. విడుదలకు కేవలం ఒక్క రోజు ముందు ఈ అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఈ సినిమా కంటెంట్ మత ఉద్రిక్తతలను రెచ్చగొట్టేలా ఉందని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రమాదం ఉందని ఆరోపిస్తూ పలువురు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం, సినిమా విడుదలను రెండు వారాల పాటు తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ వ్యవహారంపై తదుపరి విచారణ జరగనుంది. విడుదలకు ముందు భారీగా ప్రమోషన్లు, పంపిణీ ఏర్పాట్లు చేసుకున్న చిత్ర నిర్మాతలకు ఈ నిర్ణయం పెద్ద ఎదురుదెబ్బగా చెప్పవచ్చు. ఇప్పటికే పలుచోట్ల మొదలైన అడ్వాన్స్ బుకింగ్స్‌ను రద్దు చేయాల్సి రావడం వారికి ఆర్థికంగా నష్టం కలిగించనుంది. గతంలో వచ్చిన 'ది కేరళ స్టోరీ' తరహాలోనే ఈ సీక్వెల్ కూడా వివాదాల్లో చిక్కుకుంది. కేరళలో అధికారంలో ఉన్న వామపక్షాలతో పాటు కాంగ్రెస్ పార్టీ కూడా ఈ సినిమాను తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ప్రస్తుతానికి సినిమా భవితవ్యం కోర్టు తీర్పుపైనే ఆధారపడి ఉంది. ఈ 15 రోజుల స్టే తర్వాత కోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో, సినిమా యథావిధిగా విడుదలవుతుందా లేదా మార్పులతో వస్తుందా అనేది వేచి చూడాలి.

# జగన్ చేతకానితనం వల్లే సీమ లిఫ్ట్ ఆగింది

ఈ సందర్భంగా మంత్రులు నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు మాట్లాడుతూ వైసీపీ తీరును తీవ్రంగా ఎండగట్టారు. "రాయలసీమ లిఫ్ట్ పనులు 2020లోనే జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) ఆదేశాలతో ఆగిపోయాయి. ఈ విషయాన్ని నాటి తెలంగాణ మంత్రి హరీశ్ రావు స్వయంగా ప్రకటించారు. అలాంటప్పుడు, నాలుగేళ్లుగా అధికారంలో ఉన్న జగన్ ప్రభుత్వం ఏం చేసింది? కనీసం కౌంటర్ కూడా దాఖలు చేయకుండా నిర్లక్ష్యం వహించింది మీ అసమర్థత కాదా?" అని పయ్యావుల కేశవ్ ప్రశ్నించారు. ఐదేళ్ల పాలనలో రాయలసీమ ప్రాజెక్టులను నిర్వీర్యం చేసి, ప్రాజెక్టులు కొట్టుకుపోవడానికి కారణమైన జగన్ రెడ్డి ఓ రాయలసీమ ద్రోహి అని వారు అభివర్ణించారు. తమ ప్రభుత్వం రాయలసీమ అభివృద్ధికి కట్టుబడి ఉందని మంత్రులు స్పష్టం చేశారు. "రూ.12 లక్షల కోట్ల బడ్జెట్‌లో వైసీపీ ప్రభుత్వం సీమకు 1 శాతం నిధులు కూడా ఖర్చు చేయలేదు. కానీ, మేం హంద్రీనీవా పనులు పూర్తి చేసి 190 రోజుల్లోనే 44 టీఎంసీల నీటిని తరలించాం. ప్రస్తుతం రాయలసీమ ప్రాజెక్టుల్లో 366 టీఎంసీల నీటిని నిల్వ చేశాం. ఇది మా నాయకుడు చంద్రబాబు సమర్థతకు నిదర్శనం" అని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేవలం 20 నెలల్లోనే రూ.8 వేల కోట్లు ఖర్చు చేసిందని, తాజా బడ్జెట్‌లో మరో రూ.10,014 కోట్లు కేటాయించిందని వివరించారు.

వైసీపీ ప్రభుత్వం జీఓ 365 తెచ్చి 102 సాగునీటి ప్రాజెక్టులను రద్దు చేసిందని, గోరుకల్లు, గాలేరు-నగరి వంటి ప్రాజెక్టులను పూర్తిగా విస్మరించిందని మంత్రులు ఆరోపించారు. "మీ దరిద్రపు పాలనలో, మీ అసమర్థ నాయకుడి చేతకానితనం వల్లే రాయలసీమ లిఫ్ట్ ఆగిపోయింది. ఆ నిజాన్ని కప్పిపుచ్చి ఇప్పుడు డ్రామాలు ఆడుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాయలసీమను రతనాల సీమగా మార్చేందుకు ఒక యజ్ఞంలా పనిచేస్తుంటే, వైసీపీ నేతలు రాక్షసుల్లా అడ్డుపడుతున్నారు" అని మంత్రి అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ హయాంలో నిలిచిపోయిన పనులకు మమ్మల్ని బాధ్యులను చేసే ప్రయత్నాన్ని మానుకోవాలని వారు హితవు పలికారు

# ఇక ఇజ్రాయెల్ లోనూ మన యూపీఐ సేవలు

భారత డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ, యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) తన సేవలను మరో దేశానికి విస్తరించింది. భారత్, ఇజ్రాయెల్ మధ్య డిజిటల్, ఆర్థిక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తూ యూపీఐ వినియోగంపై నేడు కీలక ఒప్పందం కుదిరింది. ప్రధాని నరేంద్ర మోదీ రెండు రోజుల ఇజ్రాయెల్ పర్యటన ముగింపు సందర్భంగా ఈ చారిత్రక ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఈ ఒప్పందంలో భాగంగా, ఇజ్రాయెల్ దేశీయ చెల్లింపుల వ్యవస్థతో యూపీఐని అనుసంధానిస్తారు. దీనివల్ల ఇరు దేశాల మధ్య చెల్లింపులు మరింత వేగంగా, సులభంగా, తక్కువ ఖర్చుతో పూర్తి చేసేందుకు మార్గం సుగమం అవుతుంది. ఈ పరిణామంపై ప్రధాని మోదీ సంతోషం వ్యక్తం చేశారు. "ఇజ్రాయెల్‌లో యూపీఐ వినియోగానికి ఒప్పందం కుదరడం ఆనందంగా ఉంది" అని ఆయన తెలిపారు. ఈ ఒప్పందంతో ఇరు దేశాల్లోని వ్యాపారాలకు లావాదేవీల ఖర్చులు, సమయం తగ్గుతాయని భావిస్తున్నారు. యూపీఐ ఒప్పందంతో పాటు పలు కీలక రంగాల్లో సహకారాన్ని పెంచుకోవాలని నిర్ణయించినట్లు ప్రధాని వెల్లడించారు. "కృత్రిమ మేధ (ఏఐ), క్వాంటం, కీలక ఖనిజాలు వంటి రంగాల్లో సహకారం కోసం 'క్రిటికల్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ పార్ట్‌నర్‌షిప్' ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. అణుశక్తి, అంతరిక్ష రంగాల్లోనూ కలిసి పనిచేస్తాం" అని మోదీ వివరించారు. భారత్‌లో యూపీఐ వ్యవస్థ ఇప్పటికే అత్యంత ప్రజాదరణ పొందింది. ఆర్థిక మంత్రిత్వ శాఖ అధ్యయనం ప్రకారం, దేశంలోని మొత్తం లావాదేవీల్లో 57 శాతం యూపీఐ ద్వారానే జరుగుతున్నాయి. ముఖ్యంగా 18-25 ఏళ్ల యువతలో 66 శాతం మంది యూపీఐని వినియోగిస్తున్నారు. ప్రస్తుతం యూఏఈ, సింగపూర్, ఫ్రాన్స్, శ్రీలంక సహా 8కి పైగా దేశాల్లో యూపీఐ సేవలు అందుబాటులో ఉన్నాయి. తాజాగా ఈ జాబితాలో ఇజ్రాయెల్ కూడా చేరింది.

# పేదవాళ్ల ఇళ్లను కూలుస్తూ.. వేల కోట్లతో పార్కులా?:

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఖమ్మం నుంచి హైదరాబాద్ వరకు సామాన్యుల ఇళ్లను కూల్చివేస్తూ ప్రభుత్వం బడుగు జీవుల ఉసురు పోసుకుంటోందని ఆయన మండిపడ్డారు. ఈరోజు మీడియాతో మాట్లాడిన ఆయన, మూసీ ప్రక్షాళన పేరుతో వందలాది ఇళ్లను నేలమట్టం చేస్తున్నారని, మధుపార్క్ వంటి అపార్ట్‌మెంట్లలో నివసించే వారి ఆవేదన ప్రభుత్వానికి వినిపించడం లేదా అని నిలదీశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నా, పేదలకు కొత్తగా ఒక్క ఇల్లు కూడా ఇవ్వకపోగా, ఉన్న నీడను లాక్కోవడం దారుణమని ధ్వజమెత్తారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్య శ్రీ బకాయిలు, విద్యార్థుల డైట్ ఛార్జీలకు నిధులు లేవని చెబుతున్న సర్కారు... వేల కోట్లు వెచ్చించి గాంధీ పార్కు నిర్మించాలనుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. "బడా బాబులు వందల ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటే చూస్తూ ఊరుకుంటున్న పాలకులు, సామాన్యుడిపై మాత్రం జులుం ప్రదర్శిస్తున్నారు. కూకట్‌పల్లి ఎల్లమ్మబండ వద్ద 120 ఎకరాల భూమి అన్యాక్రాంతమైనా పట్టించుకునే నాథుడే లేడు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవేళ గాంధీ పార్కు కట్టాలనుకుంటే, కేంద్ర రక్షణ శాఖ ఇచ్చిన భూముల్లో నిర్మించుకోవాలి కానీ, పేదల ఇళ్లను పడగొట్టి కాదని అన్నారు. తెలంగాణలో జరుగుతున్న ఈ పరిణామాలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించాలని, ఇక్కడి 'దుర్మార్గాలను' తక్షణమే అరికట్టాలని ఈటల డిమాండ్ చేశారు. పేదల పొట్టకొట్టి చేస్తున్న ఈ అభివృద్ధిని ప్రజలు గమనిస్తున్నారని, ఇదే తీరు కొనసాగితే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఇల్లు కోల్పోయిన ప్రతి కుటుంబానికి తక్షణమే ప్రత్యామ్నాయం చూపాలని, లేనిపక్షంలో బాధితుల తరపున పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.

# ఇజ్రాయెల్ టెక్నాలజీపై ప్రధాని మోదీ దృష్టి..

ఈ ప్రదర్శనలో వ్యవసాయం, నీటి నిర్వహణ, ఆరోగ్యం, స్మార్ట్ మొబిలిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సైబర్ సెక్యూరిటీ, క్వాంటమ్ టెక్నాలజీస్ వంటి అనేక రంగాల్లో ఇజ్రాయెల్ సాధించిన అద్భుతమైన ఆవిష్కరణలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పలు కంపెనీల సీఈఓలు, శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలతో ప్రధాని మోదీ నేరుగా సంభాషించారు. ఇక్కడ ప్రదర్శించిన అత్యాధునిక సాంకేతికతలు భారత్-ఇజ్రాయెల్ మధ్య ఆవిష్కరణలు, స్టార్టప్‌లు, వ్యాపార భాగస్వామ్యాన్ని మరింత పెంచడానికి ఎంతగానో దోహదపడతాయని మోదీ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా వ్యవసాయం, నీటి నిర్వహణ, ఆరోగ్య సేవలు, డిజిటల్ రంగాల్లో సహకారానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ పర్యటనలో భాగంగా గాలి నుంచి తాగునీటిని ఉత్పత్తి చేసే 'వాటర్‌జెన్' టెక్నాలజీని, గురుత్వాకర్షణ శక్తితో పనిచేసే మైక్రో-ఇరిగేషన్ వ్యవస్థ 'ఎన్-డ్రిప్'ను మోదీ ఆసక్తిగా పరిశీలించారు. అలాగే, రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు సెన్సార్లు, చిప్ టెక్నాలజీని ప్రదర్శించిన 'మొబైల్‌ఐ' సంస్థ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారంగా పనిచేసే అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరికరం, సైబర్ దాడులను నిరోధించే వ్యవస్థలు, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి పలు కీలక ఆవిష్కరణల గురించి అధికారులు ప్రధానికి వివరించారు. ఆధునిక ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు "ఇండియా-ఇజ్రాయెల్ ఇన్నోవేషన్ బ్రిడ్జ్" కార్యక్రమం కింద ఇరు దేశాలు కలిసి పనిచేస్తున్నాయని ఈ సందర్భంగా అధికారిక వర్గాలు తెలిపాయి. ఈ పర్యటన ఇరు దేశాల మధ్య సాంకేతిక, వాణిజ్య సంబంధాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందని భావిస్తున్నారు

# కేటీఆర్, హరీశ్‌రావువి అన్నీ అబద్ధాలే:

. కాళేశ్వరం ప్రాజెక్టును రూ. 1.08 లక్షల కోట్ల అంచనాతో నిర్మించి, కేవలం 110 టీఎంసీల నీటిని మాత్రమే అందుబాటులోకి తీసుకురావడం గత పాలకుల అసమర్థతకు నిదర్శనమని పొంగులేటి మండిపడ్డారు. ఎన్నికలకు ముందే బ్యారేజీలు కుంగిపోయాయని అన్నారు. ఆ తప్పిదాల నుంచి తప్పుకోవడానికే ఇప్పుడు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. అలాగే బీఆర్ఎస్, బీజేపీల మధ్య 'ఫెవికాల్ బంధం' ఉందన్న విషయం బహిరంగ రహస్యమేనని, అందుకే వారు ఒకరికొకరు సహకరించుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

రాష్ట్ర నీటి ప్రయోజనాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని మంత్రి స్పష్టం చేశారు. బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా రాష్ట్ర ప్రయోజనాల కోసం సలహాలు ఇవ్వాల్సింది పోయి, కేవలం రాజకీయ లబ్ధి కోసం విమర్శలు చేయడం దురదృష్టకరమని పొంగులేటి అన్నారు. తెలంగాణ హక్కుల కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పోరాడుతుందని, గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్ది రైతులకు మేలు చేకూర్చడమే తమ ప్రథమ ప్రాధాన్యత అని ఆయన వెల్లడించారు.

# లెజిస్లేటివ్ స్పోర్ట్స్ మీట్‌లో ఉత్సాహభరిత వాతావరణం

## -ఏపీ స్పోర్ట్స్ అథారిటీ ప్రతినిధుల సందడి



విజేత పోలవరం
విజయవాడలోని ఇందిర గాంధీ మున్సిపల్ స్టేడియం నందు జరుగుతున్న లెజిస్లేటివ్ స్పోర్ట్స్ మీట్‌లో ఆటవిడుపు కార్యక్రమాలు ఉత్సాహంగా కొనసాగాయి.ఈ సందర్భంగా ఏపీ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ రవి నాయుడు కార్యక్రమానికి హాజరై క్రీడాకారులను ప్రోత్సహించారు.అలాగే ఏపీ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ శ్రీమతి కొవ్వాసు జగదీశ్వరి పాల్గొని క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.బోర్డు డైరెక్టర్లు కూడా కార్యక్రమంలో పాల్గొని పోటీలను ఆసక్తిగా వీక్షించారు.ప్రతినిధులు క్రీడల అభివృద్ధిపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.క్రీడల ద్వారా ప్రజాప్రతినిధుల్లో ఐక్యత, క్రమశిక్షణ పెంపొందుతాయని వారు పేర్కొన్నారు.పోటీల్లో పాల్గొన్న సభ్యులు ఉత్సాహంగా ఆటలలో నిమగ్నమయ్యారు.స్టేడియంలో క్రీడా వాతావరణం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.లెజిస్లేటివ్ స్పోర్ట్స్ మీట్ విజయవంతంగా కొనసాగుతోంది

# విద్యార్థులను ఆకట్టుకున్న అతిథి ఉపన్యాసం..

విజేత అరకు లోయ..
అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం అతిథి ఉపన్యాస కార్యక్రమం ఉత్సాహభరితంగా జరిగింది. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే భరత్ కుమార్ నాయక్ ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర అధ్యాపకులు ఎన్ నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులను చైతన్యపరిచే విధంగా అతిథి ఉపన్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ గురించి విద్యార్థులకు తెలియని అనేక అంశాలను సమగ్రంగా వివరించారు. చత్రపతి శివాజీ మహారాజ్ స్ఫూర్తితో విద్యార్థులు చైతన్యవంతులై తమ దిశా నిర్దేశాన్ని నిర్ణయించుకోవాలని ఆయన కోరారు. ఆర్ట్స్ విభాగపతి నాగబాబు మాట్లాడుతూ అతిథి ఉపన్యాసాలు విద్యార్థులకు భవిష్యత్తు బంగారు కు మార్గదర్శకాలు అవుతాయని ఆయన అన్నారు. అతిథిలా ఉపన్యాసాలు విద్యార్థుల బంగార భవిష్యత్తుకు పునాదులు వేయడమే కాకుండా వారి ప్రగతికి దోహద ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రతినిధులు విజయలక్ష్మి, విద్యార్థులను చైతన్యవంతులను చేసే విధంగా తన ప్రసంగాలతో ఆకట్టుకున్నారు. అనంతరం ప్రత్యేక ముఖ్య అతిథి ఎన్ నాగేశ్వరరావును కళాశాల అధ్యాపకులు, అధ్యాప ఇతర సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.






# ఎర్రవరం గ్రామంలో జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు శిబిరశీ కార్యక్రమం



విజేత, ప్రత్తిపాడు ప్రతినిధి :మండలంలో ఎర్రవరం గ్రామంలో గంగిరెడ్ల మణికంఠ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమ శిబిరానికి ముఖ్యఅతిథిగా జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్య కిరణ్ (బాబీ) హాజరై శిబిరాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మేడిశెట్టి బాబి మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా 16 సభ్యత్వ నమోదు శిబిరాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతి ఒక్కరూ సభ్యత్వం నమోదు చేయించుకోవాలని అన్నారు.అలాగే మీ సహాయ సహకారాలు జనసేన పార్టీకి అందించాలని,నియోజకవర్గ వ్యాప్తంగా 20వేల మందికి సభ్యత్వాలు నమోదు చేసేలా జన సైనికులు కృషి చేయాలి అన్నారు.అనంతరం లింగపర్తి సొసైటీ అధ్యక్షులు పెంటకోట మోహన్ మాట్లాడుతూ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ప్రతి సంవత్సరం ఎంతో ప్రతిష్టాత్మకంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో తోట గోపాలకృష్ణ, ఆకుల నాని,పలివెల వెంకటేష్, వీరబాబు, బ్రహ్మానందం,బంక కోదండరాం,గంగిరెడ్ల బాలాజీ, ప్రసాద్,బొట్టా సురేష్, ప్రకాష్, సిరిపురం శ్రీను తదితర జనసైనికులు పాల్గొన్నారు.



# నూతన వధూవరులు నాగ కోటేశ్వరరావు - దీప్తిలను ఆశీర్వదించిన శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్

విజేత ఇర్లపాడు
నాదెండ్ల మండలం ఇర్లపాడు గ్రామ సర్పంచ్ గొల్లప్రోలు కోటేశ్వరమ్మ రామాంజనేయులు ఏకైక కుమారుడి వివాహం గత రాత్రి వారి స్వగృహం నందు ఘనంగా జరుగుచుండగా ఆ వేడుకకు హాజరై నూతన వధూవరులు నాగ కోటేశ్వరరావు - దీప్తి లను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలియజేసిన శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్ ..లిఈ వేడుకలో వారివెంట లిఅంగిరేకుల రామకృష్ణ , తేళ్ళ రాజేష్ చౌదరి తోట జ్యోతి , కొప్పుల వెంకటేశ్వర్లు కొప్పుల నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు

# నాదెండ్ల పోలీసు స్టేషనును సందర్శించిన ట్రైనీ డిఎస్పీ కె. జయ కృష్ణ.



విజేత నాదెండ్ల
నాదెండ్ల పోలీసు స్టేషనును సందర్శించిన ట్రైనీ డిఎస్పీ కె. జయ కృష్ణ. ఈ సందర్భంగా ఆయన స్టేషను సిబ్బంది పనితీరును, రికార్డులను పరిశీలించారు. నాదెండ్ల ఎస్సై ఆర్. వెంకటేశ్వరరావు, యడ్లపాడు ఎస్సై శివ రామకృష్ణ, సిబ్బంది ఉన్నారు

# సర్వేల పేరుతో అందుబాటులో లేని సచివాలయ సిబ్బంది

## -- ఇబ్బందులు పడుతున్న ప్రజలు







విజేత దేవరపల్లి :
దేవరపల్లి మండల పరిధిలోని గ్రామ సచివాలయాల్లో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ప్రజలకు పౌర సేవలు అందడంలో అంతరాయం కలుగుతోంది. వివిధ అవసరాల కోసం దూర ప్రాంతాల నుంచి సచివాలయాలకు వస్తున్న ప్రజలు సిబ్బంది లేక తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.సిబ్బంది ఎక్కడ ఉన్నారని ప్రజలు ప్రశ్నించగా, “సర్వే పనుల నిమిత్తం ఫీల్డ్‌లో ఉన్నారు” అనే సమాధానం మాత్రమే అందుతోందని వాపోతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సిబ్బంది మొత్తం సర్వేల కోసం బయటికెళ్లడం వల్ల పౌర సేవలు పూర్తిగా నిలిచిపోతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రేషన్, పింఛన్లు, ఆదాయ ధృవపత్రాలు, నివాస ధృవపత్రాలు వంటి అత్యవసర సేవల కోసం వచ్చిన ప్రజలు గంటల తరబడి వేచి చూసినా పనులు పూర్తికాక నిరాశతో తిరిగి వెళ్లాల్సి వస్తోందని తెలిపారు.సిబ్బంది అంతా ఫీల్డ్‌లో ఉంటే ప్రజల సమస్యలు పరిష్కరించే వారు ఎవరని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సచివాలయాల్లో కనీస సిబ్బందిని అందుబాటులో ఉంచి పౌర సేవలకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ప్రతి కార్డుదారునితో మర్యాదగా వ్యవహరించాలి - డీ ఎస్ ఓ విలియమ్స్.



విజేత . బుట్టాయగూడెం.
ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం లోని తహసీల్దార్ కార్యాలయము నందు డీ ఎస్ ఓ విలియమ్స్ ఆధ్వర్యంలో రేషన్ డీలర్లకు రేషన్ పంపిణీలో తగు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా డి ఎస్ ఓ విలియమ్స్ మాట్లాడుతూ కార్డుదారులందరితో రేషన్ డీలర్లు మర్యాదగా వ్యవహరించాలని , మంచి రిలేషన్ ను మెయింటినెన్స్ చేయాలి అని అన్నారు. రేషన్ ఎవ్వరూ కూడా తీసుకోలేదనే అపవాదు రాకూడదని , ప్రతి కార్డుదారునికి రేషన్ అందాలి అని తెలియజేశారు. 65 సంవత్సరాలు పైబడిన వారు సుమారు మన ఏలూరు జిల్లా లోనే 73 వేల మంది ఉన్నారని , వారికి ఇంటికి వెళ్లి రేషన్ ఇమ్మని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ప్రతి నెల డీలర్ కు 30 నుండి 50 మంది వృద్ధులకు రేషన్ ఇవ్వవలసి ఉంటుందని తెలిపారు. వృద్ధులకు పంపిణీ చేసే బియ్యం ప్రతి నెల 25 నుండి నెల చివరి వరకు అందించాలని ఆదేశించారు. బుట్టాయిగూడెం మండలంలో రేషన్ పంపిణీలో కొన్ని సమస్యలను గుర్తించడం జరిగిందని వాటిని 2 , 3 రోజుల్లో పరిష్కరిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్డుదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని , ఏజెన్సీ ప్రాంతాలలో గిరిజనులకు రేషన్ సక్రమంగా అందించాలని సూచించారు. ఐ వి ఆర్ ఎస్ సర్వేలో మన జిల్లాను ప్రథమ స్థానంలో ఉంచుతారని ఆశిస్తున్నానని విలియమ్స్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రతాపరెడ్డి ఏ ఎస్ ఓ , పద్మ సి ఎస్ ఆర్ ఐ , మరియు రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

# తిరుమల ప్రతిష్టతతో కూటమి చెలగాటం

## బాబు డైరెక్షన్... పవన్ యాక్షన్ వైసీపీ నేతల ధ్వజం

విజేత, (తాడేపల్లిగూడెం) పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో: తిరుమల లడ్డూ ప్రసాదం విషయంలో కూటమి ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసం అబద్ధపు ప్రచారాలు చేస్తూ భక్తుల మనోభావాలను దెబ్బతీస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. స్థానిక నియోజకవర్గ ఇంచార్జి వడ్డి రఘురామ్ నాయుడు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కొప్పుల వెలమ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గొర్రెల శ్రీనివాస్, ఎంపీపీ పి. శేషులత, జెడ్పీటీసీ ఉప్పులూరి వరలక్ష్మి సహా పలువురు ముఖ్య నేతలు మాట్లాడారు. ప్రభుత్వం స్వయంగా నియమించిన సిట్ నివేదికలోనే కల్తీ జరగలేదని స్పష్టమైనప్పటికీ, ఆ వాస్తవాన్ని అంగీకరించకుండా మళ్లీ విచారణ కమిషన్ల పేరుతో కాలయాపన చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గతంలో టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డి ఆధ్వర్యంలో పారదర్శకమైన పాలన జరిగిందని, అనేక ల్యాబ్ రిపోర్టులు కల్తీ లేదని తేల్చినప్పటికీ చంద్రబాబు, పవన్ కళ్యాణ్ బురదజల్లే రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. పవన్ కళ్యాణ్ కేవలం చంద్రబాబు రాసిచ్చిన స్క్రిప్టును చదువుతూ, రసాయనాలతో నెయ్యి తయారు చేయొచ్చని అవగాహన లేని వ్యాఖ్యలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. అయోధ్యకు పంపిన లడ్డూలపై ఎటువంటి ఆధారాలు లేకుండా విషప్రచారం చేయడం వల్ల ప్రపంచవ్యాప్తంగా తిరుమల ఖ్యాతి దెబ్బతిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇండపూర్ డెయిరీ, హెరిటేజ్ సంస్థల మధ్య ఉన్న వ్యాపార సంబంధాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే ఈ 'డైవర్షన్ పాలిటిక్స్' చేస్తున్నారని వారు ఆరోపించారు. కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి సాక్షిగా అధర్మ రాజకీయాలకు పాల్పడుతున్న వారికి ఆ భగవంతుడే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో వైసీపీ నేతలు మానుకొండ వెంకటేశ్వరరావు, గుండుమోగుల నాగు, తానేటి అజయ్, పట్నాల గణపతి, కలిశెట్టి తాతారావు పాల్గొన్నారు.



# గ్రామాల్లో బెల్ట్ షాపులు మూసివేయాలి.

విజేత,ప్యాపిలి:
స్థానిక మండలంలోని అక్రమంగా నడుస్తున్న బెల్ట్ షాపులను తక్షణమే మూసివేయాలని (సిపిఐ) డిమాండ్ చేసింది. పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో పట్టణ కార్యదర్శి వెంకటేష్ అధ్యక్షతన మండల కార్యదర్శి జె. మహేష్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జె. మహేష్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వ అనుమతి లేకుండా నడుస్తున్న బెల్ట్ షాపులు పేద ప్రజల కుటుంబాలను ఆర్థిక, సామాజికంగా దెబ్బతీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్సైజ్ చట్టాలను ఉల్లంఘిస్తూ కొందరు అక్రమ మద్యం విక్రయదారులు గ్రామాలను మద్యపు బానిసత్వంలోకి నెట్టేస్తున్నారని విమర్శించారు. ఇది కేవలం చట్టవిరుద్ధ వ్యాపారం మాత్రమే కాకుండా ప్రజల జీవితాలతో జరుగుతున్న అన్యాయమని అన్నారు.
మద్యం ప్రభావంతో గ్రామాల్లో గృహహింస పెరుగుతోందని, మహిళలు మరియు పిల్లలు భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు. కూలీల సంపాదన మొత్తం మద్యం దుకాణాలకే వెళు ్తుండటంతో కుటుంబాలు ఆర్థికంగా కుంగిపోతున్నాయని, యువత భవిష్యత్తు చీకటిలోకి నెట్టబడుతోందని పేర్కొన్నారు.
ప్రభుత్వం మద్యం నియంత్రణపై కేవలం ప్రకటనలకే పరిమితమవుతోందని, గ్రామాల్లో బెల్ట్ షాపులు బహిరంగంగా నడవడం అధికారుల వైఫల్యానికి నిదర్శనమని ఆరోపించారు. సంబంధిత ఎక్సైజ్, పోలీసు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు.ఈ సందర్భంగా సిపిఐ నాయకులు డిమాండ్లు చేశారు.గ్రామాల్లో ఉన్న అన్ని అక్రమ బెల్ట్ షాపులను తక్షణమే మూసివేయాలని,అక్రమ మద్యం విక్రయదారులపై కఠిన క్రిమినల్ కేసులు నమోదు చేయాలి; నిర్లక్ష్యం చేసిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని,మహిళా సంఘాలు, గ్రామ కమిటీలతో కలిసి ప్రత్యేక డ్రైవ్ చేపట్టి శాశ్వత పరిష్కారం చూపాలి.బెల్ట్ షాపులపై వెంటనే చర్యలు తీసుకోకపోతే గ్రామ స్థాయిలో పోరాటాలు, ఆందోళనలు చేపడతామని సిపిఐ నేతలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు చంద్రుడు, రాము, నాగన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# జిసిసి సమస్యలపై గిరిజన సంక్షేమ శాఖ మంత్రిని కలిసిన కిడారి...

విజేత అరకులో..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గిరిజన సహకార సంస్థలో నెలకొన్న సమస్యలపై ఏపీ గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ను స్వయంగా కలిసి సమస్యల పరిష్కరించాలని కోరారు. అమరావతి మంత్రి చాంబర్లో గురువారం కలిసిన జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ గిరిజన సహకార సంస్థలు పేరుకుపోయిన సమస్యలను సమగ్రంగా వివరించారు. జిసిసి లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని, కొన్నేళ్లుగా ప్రత్యక్ష నియామకాలు లేవే లేవని, ప్రమోషన్లు కూడా అంతంత మాత్రమేనని, కాఫీ కొనుగోలుకు అదనపు నిధులు లేవని ఆయన మంత్రికి సమగ్రంగా తెలియజేశారు. భవిష్యత్తు కాలంలో భారీ సంఖ్యలో గిరిజన సహకార సంస్థలో ఉద్యోగులు పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో సమస్య మరింత జటిలమయ్యే అవకాశం ఉందని ఆయన మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అంతేకాకుండా దీర్ఘకాలికంగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న గిరిజన సహకార సంస్థ ఉద్యోగుల సమస్యలపై కూడా స్పందించాలని కిడారి శ్రావణ్ కుమార్ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని కోరారు. ప్రస్తుత కాఫీ సీజన్లో గిరిజన రైతుల నుండి కాఫీ కొనుగోలు చేయాలంటే జిసిసికి నిధులు ఆవశ్యకత ఎంతైనా ఉందని దానిపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రినీ ఆయన విజ్ఞప్తి చేశారు. అడపా దడపా నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ కార్యక్రమంలో గిరిజన ప్రజానీకం నుండి అనేక సమస్యలు వస్తున్నాయని



ఆయన మంత్రికి తెలియజేశారు. తన దృష్టికి వచ్చిన సమస్యలపై ప్రభుత్వంతో సంప్రదించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి గుమ్మడి సంధ్యారాణి జిసిసి చైర్మన్ కిడారి కి హామీ ఇచ్చారు

# వీఆర్వో, వీఆర్ఏలకు ఉచిత వైద్య పరీక్షలు

**- కలెక్టర్ చదలవాడ నాగరాణి**

విజేత, (భీమవరం) పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో:

జిల్లాలో పనిచేస్తున్న వీఆర్వో లు, వీఆర్ఏల ఆరోగ్యంపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. వీరందరికీ ఈనెల 26 నుండి మార్చి 25 వరకు జిల్లాలోని ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి ఒక ప్రకటనలో తెలిపారు.సిబ్బంది ఆరోగ్యంగా ఉన్నప్పుడే ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని, ఈ అవకాశాన్ని జిల్లాలోని 456 మంది వీఆర్వోలు, 626 మంది వీఆర్ఏలు తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

షెడ్యూల్ వివరాలు:

తణుకు, తాడేపల్లిగూడెం ఆసుపత్రులు: ఫిబ్రవరి 26 నుండి మార్చి 4 వరకు (తణుకు, ఇరగవరం, అత్తిలి, తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాల వారికి).

నరసాపురం ఏరియా ఆసుపత్రి: ఫిబ్రవరి 26 నుండి మార్చి 5 వరకు (నరసాపురం, మొగల్తూరు, యలమంచిలి మండలాల వారికి).

పాలకొల్లు ఏరియా ఆసుపత్రి: ఫిబ్రవరి 26 నుండి మార్చి 11 వరకు (పెనుగొండ, పెనుమంత్ర, ఆచంట, పోడూరు, పాలకొల్లు మండలాల వారికి).

భీమవరం ఏరియా ఆసుపత్రి: ఫిబ్రవరి 26 నుండి మార్చి 25 వరకు (భీమవరం, పాలకోడేరు, వీరవాసరం, ఆకివీడు, కాళ్ల, ఉండి, గణపవరం మండలాల వారికి).

ప్రభుత్వ నిబంధనల ప్రకారం వైద్యులచే ఈ ఉచిత



పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, రెవెన్యూ సిబ్బంది అందరూ తమకు కేటాయించిన తేదీల్లో హాజరై పరీక్షలు చేయించుకుని ఆరోగ్యవంతులుగా ఉండాలని కలెక్టర్ ఆకాంక్షించారు

# ఏలేశ్వరం అప్పన్నపాలెం వంతెన పరిశీలించిన పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ చీఫ్ కే.విజయ కుమారి

విజేత, ప్రత్తిపాడు ప్రతినిధి :ఏలేశ్వరం - జగ్గంపేట నియోజకవర్గ ప్రజల దశాబ్దాల కల నెరవేరబోతోందని కూటమి నాయకుల అభిప్రాయ పడ్డారు.అప్పన్న పాలెం వంతెనను పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ చీఫ్ ఇంజనీర్ కె.విజయ కుమారి స్థానిక నాయకులు అలమండ చలమయ్య,బొద్దిరెడ్డి గోపి,మూది నారాయణస్వామిలతో కలిసి పరిశీలించారు.స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి, పరిశీలించి వంతెన నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.ఎన్ఆర్ఈజీఎస్, పీఎంజీఎస్వై, నాబార్డ్ వంటి పథకాలతో పంచాయతీరాజ్ శాఖలో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు.ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల రూపురేఖలు మారుతున్నాయని. ఇందులో భాగంగానే, ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ఏలేశ్వరం , జగ్గంపేట ప్రధాన అనుసంధాన వంతెన(అప్పన్నపాలెం వంతెన) సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుందని తెలిపారు.గర్భిణీలు,వృద్ధులు మరియు చిన్నపిల్లలు పడుతున్న ఇబ్బందులను గమనించిన పంచాయతీరాజ్ చీఫ్ ఇంజనీర్ విజయ కుమారి దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.ఏలేరు రిజర్వాయర్ నుండి వచ్చే భారీ డిశ్చార్జ్‌ను తట్టుకునేలా, 7.5 మీటర్ల వెడల్పుతో అత్యాధునిక 'టూ-లేన్' హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి డిజైన్ సిద్ధమైందని అన్నారు.ఈ ప్రాజెక్టు కోసం ఇప్పటికే రూ18 కోట్లతో డీపీఆర్ సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు.స్థానిక ఎమ్మెల్యే, ఎంపీల నిరంతర ఫాలో-అప్‌తో ఈ పనులు వేగవంతం అయ్యాయి.సాయిల్ ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి, నీటి ప్రవాహం ఎక్కువగా ఉండే సెంటర్ పాయింట్‌నే నిర్మాణానికి ఎంచుకున్నారు. వచ్చే ఒకటిన్నర ఏళ్లలో ఈ వంతెనను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా యంత్రాంగం కసరత్తు చేస్తోందన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,డిప్యూటీ గారి చొరవతో ఏజెన్సీ ఏరియాలో 'అడవి తల్లి బాట' లాంటి కార్యక్రమాలతో పాటు, ఈ వంతెన నిర్మాణం కూడా త్వరితగతిన పూర్తి కానుందని.ఈ సందర్భగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఈ. ఏవీఎస్ శ్రీనివాస్, డిఈ గంగాధర్, ఈ ఈ ఎన్ సీతయ్య, జై ఈ ఈ మురళీకృష్ణ, కౌన్సిలర్లు ఎండగుశీడి



నాగబాబు,కోణాల వెంకటరమణ,పెంద్ర శ్రీను,మామిడి లలిత,రాయుడు చిన్న, సామంతుల గోపి,గాంధీ ,వాగు రాజేష్, బుగతా శ్రీను తదితర కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# జీలుగుమిల్లి పోలీస్‌స్టేషన్లో మంత్లీ సబ్ డివిజనల్ క్రైమ్ మీటింగ్



విజేత జీలుగుమిల్లి

ఏలూరు జిల్లా జీలుగుమిల్లి పోలీస్ స్టేషన్ లో ప్రతినెలా జరిగే మంత్లీ సబ్ డివిజనల్ క్రైం మీటింగ్ కి ఏడు మండలాల ఎస్ ఐ లు, సీ ఐ లు పాల్గొన్నారు.జీలుగుమిల్లి సీ ఐ బి. వెంకటేశ్వరరావు. పోలవరం సీ ఐ బాల సురేష్. కుకునూరు సీ ఐ రమేష్. ఎస్ ఐ క్రాంతి కుమార్, చంద్రశేఖర్, మహేశ్వరరావు, జయ బాబు, పవన్ కుమార్ పాల్గొన్నారు.

# ఏలూరు ఎంపీ పుట్ట మహేష్ కుమార్‌ను కలిసిన కుక్కునూరు వేలేరుపాడు మండలాల నేతలు



విజేత జీలుగుమిల్లి

ఏలూరు జిల్లా కుక్కునూరు మరియు వేలేరుపాడు మండలాల పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఏలూరు పార్లమెంట్ సభ్యులు శ్రీ పుట్ట మహేష్ కుమార్ ని ఇరు మండలాల పార్టీ అధ్యక్షులు మర్యాదపూర్వకంగా కలిశారు. కుక్కునూరు మండల అధ్యక్షులు అమరవరపు అశోక్, వేలేరుపాడు మండల అధ్యక్షులు ముల్లిశెట్టి నాగు ఎంపీని కలిసి, స్థానిక సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు.

చర్చించిన ప్రధాన అంశాలు:

ఈ సమావేశంలో మండలాల అభివృద్ధి మరియు పోలవరం నిర్వాసితుల కష్టాలపై ఎంపీ కి వినతి పత్రం సమర్పించారు. ప్రధానంగా ఈ క్రింది అంశాలపై చర్చ జరిగింది:

మౌలిక సదుపాయాలు: ముంపు లేని ప్రాంతాలలో వెంటనే సిసి (జజ) రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు.తాగునీటి సమస్య: రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని, మండలాల్లో ఎక్కడా మంచినీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని విన్నవించారు.పోలవరం నిర్వాసితుల సమస్యలు: 45 కాంటూర్ పరిధిలోని గ్రామాలను 41 కాంటూర్ లో కలిపి న్యాయం చేయాలని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ పరిహారం అందేలా చూడాలని కోరారు.ప్యాకేజీ మరియు పరిహారం: నాన్-లోకల్‌గా ఉన్న వారందరికీ ప్యాకేజీ వర్తింపజేయాలని, మిగిలిన పొలాలకు కూడా త్వరితగతిన పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు.రైతు సంక్షేమం: పెద్దవాగు ప్రాజెక్టుకు వెంటనే మరమ్మతులు చేపట్టి, సాగునీరు విడుదల చేయడం ద్వారా రైతాంగాన్ని ఆదుకోవాలని చర్చించారు.ఈ సమస్యలపై ఎంపీ పుట్ట మహేష్ కుమార్ సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు

# రాజధాని అమరావతి అభివృద్ధిని అడ్డుకునే కుట్రలు ఆరంభమయ్యాయి!

## -అభివృద్ధి ఆగాలి నిధులు రాకూడదు.-ఈ దురుద్దేశంతో ఆళ్ల రామకృష్ణారెడ్డి విషం కక్కారు.!

## -మూడు రాజధానుల ఉద్యమం ఫెయిల్ అయింది-అమరావతి అనేది చరిత్ర

## -ప్రముఖ న్యాయవాది వైఎస్ఆర్సిపి నాయకులు పచ్చల శ్యాంబాబు

విజేత మంగళగిరి

రాజధాని అమరావతిని అడ్డుకునే కుట్రలు ఆరంభమయ్యాయని ప్రముఖ న్యాయవాది, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పచ్చల శ్యాంబాబు అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం మంగళగిరిలోని ప్రెస్ క్లబ్ నందు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వైఎస్ఆర్ సీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కె) ఇటీవల ప్రెస్ మీట్ నిర్వహించి చేసిన వ్యాఖ్యలను శ్యాంబాబు తీవ్రంగా ఖండించారు. ఇన్నర్ రింగ్ రోడ్డు మ్యాప్ లో మార్పులు, చేర్పులు చేశారంటూ ఆర్కే వ్యాఖ్యానించటం సరికాదని అన్నారు. రాజధాని అమరావతి అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో అభివృద్ధి ఆగిపోవాలి నిధులు రాకూడదు అన్న కుట్రతో ఆళ్ల రామకృష్ణారెడ్డి అండ్ కో బ్యాచ్ పయనమైందని విమర్శించారు. లింగమనేని రమేష్ కు లబ్ధి చేకూరేలా ఇన్నర్ రింగ్ రోడ్డు ను ఆయన భూముల ప్రక్క నుండి వెళ్లేలా చంద్రబాబు డిజైన్ చేశారని ఆర్కే ఆరోపించారని శ్యాంబాబు అన్నారు. మరి అలాగైతే 2019 నుంచి 2024 వరకు జగనన్న ముఖ్యమంత్రిగా ఉన్నారు మీరు మంగళగిరి ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇన్నర్ రింగ్ రోడ్డు పేదల భూముల్లో నుంచి వెళ్లేలా ఎందుకు ప్రయత్నించలేదు అన్న అంటూ ఎద్దేవా చేశారు. అభివృద్ధి జరుగుతున్న క్రమంలో రకరకాల ప్రాజెక్టులు వస్తుంటాయని తెలిపారు. లింగమనేని రమేష్ నుండి చంద్రబాబు కోట్ల రూపాయల భూముల్ని ఎకరం కేవలం ఎనిమిది లక్షలకు కొనుగోలు చేశారని ఆర్కే విమర్శించిన విషయాన్ని శ్యాంబాబు గుర్తు చేశారు. కంతేరు చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో మీకు దాదాపు 20 ఎకరాలు పొలం ఉంది. దానికి రేటు పెరుగుతుంది కదా. మరి మీరు ఐటీ కడుతున్నారా అంటూ ప్రశ్నించారు. గుడ్డ కాల్చి ఎదుటి వ్యక్తి మీద వేసే సమయంలో ఆలోచించుకొని మాట్లాడాల్సిన అవసరం ఉందని మంచో చెడు అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ఈ విధంగా ఆర్కె చంద్రబాబుపై కేసులు వేసి మీ దృష్టిని ఆకర్షించాలని తద్వారా అక్రమంగా సంపాదించిన సంపాదనతో ఎన్నికల్లో ఏదో ఒకచోట ఎమ్మెల్యే టికెట్ తీసుకుని ప్రజాక్షేత్రంలోకి రాకుండా పోటీ చేయాలని చూస్తున్నారు మీరు అప్రమత్తంగా ఉండండి జగనన్న అంటూ శ్యాం బాబు సూచించారు. గౌతమ బుద్ధుడు నడిచిన నేల అమరావతి ఇటువంటి ప్రాంతంలో రాజధాని రావడం ఈ ప్రాంత వాసిగా సంతోషిస్తూ, ఈ ప్రాంతం పై నేను అభిమానాన్ని చాటుకుంటున్నాను. అని అన్నారు. స్వాతంత్ర్యానికి ముందు, స్వాతంత్రానికి తర్వాత కానీ ఒక రక్తపు బొట్టు చిందకుండా వేల ఎకరాలను రైతుల నుండి సమీకరించిన దాఖలాలు లేవు అని గుర్తు చేశారు. కానీ రాజధాని అమరావతి నిర్మాణానికి రైతుల్ని ఒప్పించి 33 వేల ఎకరాల పైచిలకు భూముల్ని సమీకరించి ఆ భూములను కొంత రైతులకు పంచి మరి కొంత అభివృద్ధి చేయడానికి ఉపయోగిస్తున్నారు అని పేర్కొన్నారు. ఇది చరిత్ర అని ఈ విధమైన అభివృద్ధికి విజ్ఞతతో సహకరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. 2022లో జగనన్న సీఎంగా ఉన్నప్పుడు సిఐడి అధికారులను మనం ప్రలోభ పెట్టాం అనేది నిజం అయితే నేడు జరిగింది కూడా నిజం అప్పుడు ప్రలోభ పెట్టలేదు అంటే నేడు జరగలేదని అర్థం అంటూ వ్యాఖ్యానించారు. ఇన్నర్ రింగ్ రోడ్డు ను బూచిగా చూపి రాజధానిపై ఆర్కే విషం కక్కుతున్నారని తీవ్రంగా మండిపడ్డారు.

శాంతి భద్రతలు ఆరోజు జగనన్న చేతుల్లోనే ఉన్నాయి

ఆర్కే అన్న ఒకసారి గుర్తుకు తెచ్చుకో మన జగనన్న ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సైతం శాంతిభద్రతలు జగన్మోహన్ రెడ్డి చేతుల్లోనే ఉన్నాయని శ్యాంబాబు తెలిపారు. అప్పట్లో మేకతోటి సుచరిత, తానేటి వనితలకు మొక్కుబడిగా హోంమంత్రి పదవులను ఇచ్చినప్పటికీ మాట్లాడే కనీస స్వేచ్ఛ లేకుండా చేశారని విమర్శించారు. నేడు హోం మంత్రి అనితకు ఉన్న స్వేచ్ఛ ఆరోజు ఎక్కడ ఉంది ఒక హోంగార్డును కూడా బదిలీ చేయించుకోలేని పరిస్థితులను మర్చిపోతే ఎలా అని ప్రశ్నించారు. మనం ఎమ్మెల్యేలు ఎంపీలు కావచ్చు కానీ ఐపీఎస్ అధికారులం కాలేము కదా అని అన్నారు. కానీ ఒక ఐపీఎస్ అధికారి ఉద్యోగ విరమణ తర్వాత ప్రజా ప్రతినిధిగా పోటీ చేసి గెలిచే అవకాశం ఉంటుంది అని పేర్కొన్నారు. పార్టీ అధికారంలో ఉన్న ఐదేళ్లు మీరు ఎమ్మెల్యేగా ఉండి సొంత పార్టీ ప్రతిపక్ష పార్టీ నేతలపై తప్పుడు కేసులు పెట్టలేదా అటువంటి మీపై ఏ క్రిమినల్ కేసు పెట్టాలి అని ప్రశ్నించారు. డిజిపి కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉన్న టిడిపి జాతీయ కార్యాలయం పై ఆనాడు దాడి జరిగితే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఎందుకు స్పందించలేదని శ్యాంబాబు అన్నారు.



3 రాజధానుల ఉద్యమానికి రమ్మంటే ససేమిరా అన్నాను

గతంలో మాజీ ఎంపీ నందిగం సురేష్ 3 రాజధానుల ఉద్యమానికి మద్దతు తెలపాలని తనను ఆహ్వానిస్తే వచ్చే ప్రశక్తి లేదని తేల్చి చెప్పానని పచ్చల శ్యాంబాబు అన్నారు. మూడు రాజధానుల ఉద్యమం ఫెయిల్ అని అమరావతి ఉద్యమం సక్సెస్ అని తెలిపారు. కౌంటర్ ఉద్యమాలు సక్సెస్ అయిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. 33,000 ఎకరాలు అమరావతి నిర్మాణానికి సరిపోదంటూ ఆనాడు అసెంబ్లీ సాక్షిగా జగన్మోహన్ రెడ్డి తెలిపారని తిరిగి ముఖ్యమంత్రి అయ్యాక మూడు రాజధానులు అంటూ ప్లేట్ మార్చేశారని విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి తీసుకునే నిర్ణయాల్లో తప్పు ఉన్నా దానిని ఖండిస్తానని తెలిపారు. రాజధాని అమరావతి అభివృద్ధి అద్భుతంగా జరుగుతోందని ఇందులో తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. తాను వైఎస్ఆర్సిపి లోనే ఉన్నానని అదే పార్టీలో కొనసాగుతానని పార్టీ మారబోనని స్పష్టం చేశారు.

# మట్లవారిపల్లె జడ్పీ హైస్కూల్‌లో వార్షికోత్సవ వేడుకలు

రామసముద్రం విజత పిబ్రవరి 26 మండలం లోని మట్లవారిపల్లె ప్రభుత్వ జడ్పీ జడ్పీ హైస్కూల్లో వార్షికోత్సవ వేడుకలు హెచ్ ఎం వెంకటరణ నాయుడు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిధులుగా ఎం ఈ వో 2ఆంజనేయులు, టిడిపి సీనియర్ నాయకులు వెంకటరమణ రెడ్డి, స్కూల్ చైర్మన్ కృష్ణప్ప, ఉపసర్పంచ్ దొర బాబు హెచ్ ఎం లు చిట్టిబాబు, రమేష్,జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ చిట్టిబాబు వీరిని ఉపాధ్యాయులు విద్యార్తులు సాధరంగా స్వాగతం పలికారు. జ్యోతి ప్రజ్వలన చేసి ఈ వేడుకలను ప్రారంభం చేశారు. పాఠశాలని ప్రాంగాణాన్ని పచ్చని తోరణాలు కట్టి పలు రకాల పుష్పాలతో అలంకరణ చేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖులు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి మంచి విజయాలు సాధించాలన్నారు. రేపటి భవిష్యత్తు కోసం విద్యార్థులు యొక్క జీవితప్రయాణాన్ని ఎలా ముందుకు తీసుకు పోవాలో ఉపాధ్యాయులు విద్యార్థుల కు దిశా నిర్దేశం చేయడం జరిగింది. గడిచిన జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ చేసిన తప్పుల నుంచి పాఠాలు నేర్చుకుంటూ దూరమైన బంధాలను తిరుగు కలుపు కుంటూ ఆగిపోయిన కలలకు ఆశలు కల్పిస్తూ చేపట్టి వలసిన పనులు నిర్దేసించుకుంటూ మనజీవితం లో వెలుగులు కోసం ప్రార్తిస్తూ లక్ష్మసాధన పోరాటాన్ని ప్రారంభిస్తూ ఉన్న చదువుల నుండి ఉన్న త మైన చదువులవైపు అడుగువేస్తున్న విద్యార్థులు ప్రతి సమస్యను పరిష్కరించు కుంటూ విజయపదముల వైపు అడుగులు వేయాలని తెలిపారు. పై మీరు మొబైల్ మంచికి వినియోగించుకొండి,పదవ తరగతి విద్యార్థులు సమయపాలనతో చదువుతూ మంచి ఉత్తీర్ణత శాతం సాధించాలన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి ఒక వే యంతో చదివి మంచి ఉద్యోగాలతో స్థిరపడి తల్లి దండ్రులకు, విద్యనేర్పిన గురువులకు పేరు ప్రక్యాతలు తీసుకురావాలన్నారు. చెడు అలవాట్ల జోలికి వెళ్ళరాదన్నారు. అనంతరం విద్యార్థులు పలు



సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పదవతరగతి పరీక్షలు రాసే విద్యార్థులు పెద్దకురప్పల్లె గ్రామపంచాయతీ సర్పంచ్ రెడ్డెప్పనాయుడు వారి కుమారుడు హరిప్రసాద్ నాయుడు పరీక్ష సామగ్రీన్ని వితరణ చేశారు. విద్యార్థులకు ఈ వేడుకల్లో పాల్గొన్న వారికి విందు ఏర్పాట్లు చేశారు. ఈపాఠశాల వార్షికోత్సవం లో పాల్గొన్నా ఎం ఈవో 2 ఆంజనేయులు హెచ్ ఎం లు చిట్టి బాబు రమేష్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చిట్టిబాబు, రెడ్డిశేఖర్, కృష్ణ మూర్తి, రమణ, బాలాజీ, ప్రభాకర్, పీడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# కామ్రేడ్ నల్ల కన్ను మృతికి నివాళి అర్పించిన,సిపిఐ. నాయకులు జి. రంగన్న

ఎమ్మిగనూరు ఫిబ్రవరి 26 భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఎమ్మిగనూరు సమితి ఆధ్వర్యంలో సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ మాజీ చైర్మన్ కామ్రేడ్ ఆర్ నల్ల కన్ను కి ఎమ్మిగనూరు పట్టణ సమితి సిపిఐ ఆధ్వర్యంలో సోమప్ప సర్కిల్ లో ఆయన చిత్రపటానికి పూలమాలాలు వేసి నివాళులు అర్పించడం జరిగినది అమరహే నల్ల కన్ను జోహార్ నల్ల కన్ను అంటూ నినాదాలు చేస్తూ పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగినది ఈ కార్యక్రమానికి సిపిఐ పట్టణ కార్యదర్శి రంగన్న అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా హాజరైన సిపిఐ జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మునేప్ప పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ మాట్లాడుతూ వారు తమిళనాడు రాష్ట్రంలో 26/12/1926 నాడు భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించింది అదే రోజు కామ్రేడ్ ఆర్.నల్ల కన్నా కూడా జన్మించడం జరిగినది మొదట స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొని బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాటం చేశారు అనంతరం మార్క్సిజానికి ఆకర్షితులై కమ్యూనిస్టు పార్టీ లో చేరి నాటి నుండి తమిళనాడు రాష్ట్రంలో భారత కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేయడంలో తన వంతు పాత్ర పోషించి ఆ రాష్ట్రంలోని రైతుల, వ్యవసాయ కూలీల కోసం ఉద్యోగుల కోసం అనేక విరోచితమైనటువంటి పోరాటాలు నిర్వహించి ఎలాంటితప్పుచేయనటువంటి




కేసులో 14 ఏళ్లు జైలు శిక్ష అనుభవించి బయటికి వచ్చిన తర్వాత కూడా కమ్యూనిస్టు పార్టీ జెండా వదలకుండా పనిచేసిన నిజాయితీపరుడు నిరాడంబర జీవితాన్ని గడుపుతూ వ్యక్తి నల్ల కన్ను అని నిరాడంబర జీవితం గడిపినటువంటి వ్యక్తికి తమిళనాడు ప్రజలు రెండవ గాంధీగా తెలుసుకునేవారు అలాంటి వ్యక్తికి తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి స్టాలిన్ తమిళనాట అవార్డును ప్రకటించి అక్షరాల 10 లక్షల రూపాయలు ఆయనకు రివార్డు అందించగా 10 లక్షలకు మరి 5000 కలిపి 10 లక్షల5 వేల రూపాయలు తిరిగి సీఎం రిలీఫ్ ఫండ్ కి నల్ల కన్నా అందజేయడం జరిగినది ఇంత నిజాయితీపరుడు ఈ తరంలో ఉండడం చాలా అరుదని నల్ల కన్ను మరణం భారత కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని వారు అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంపన్న గౌడ్, భాస్కర్ యాదవ్,విరూపాక్ష, సిపిఐ.నాయకులు మద్దిలేటి , రాజీవ్, తిమ్మగురుడు, మాలిక్ , విజెంద్ర, సమీహుల్ నరసింహులు, మల్లికార్జున గౌడ్, నాగరాజు దస్తగిరి తదితరులు పాల్గొన్నారు

# రెడ్డిపోగు భాస్కర్.ని పరామర్శించినఎమ్మార్పీఎస్ నాయకులు

## వెల్దుర్తి మండలం కలుగొట్లగ్రామానికివెళ్లినఎమ్మిగనూరు టీం ..

ఎమ్మిగనూరు ఫిబ్రవరి 26 ౯

కర్నూలు జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు రెడ్డిపోగు భాస్కర్ అన్నపై హత్యాయత్నం జరిగిన విషయం తెలిసిందే నిన్న ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడ సమీపంలోహత్యాయత్నం లో తప్పించుకొని ప్రాణాపాయం నుండి బయటపడిన కర్నూలు జిల్లా అధ్యక్షులు రెడ్డిపోగు భాస్కర్ అన్నను నేడు వారి స్వగ్రామం కలుగొట్లలో ఎమ్మిగనూరు వీ౯రూ టీం మంత్రాలయం నియోజకవర్గం కో ఇన్చార్జ్ ముగతి ప్రతాప్ కుమార్ మాదిగ , ఎమ్మిగనూరు ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు కడిమెట్ల గిడ్డయ్య మాదిగ , ఎమ్మిగనూరు మండల ఉపాధ్యక్షులు నాగలాపురం రాజుమాదిగపరామర్శించడం జరిగింది .

నిన్న బైక్ పై కర్నూలు వెళ్తున్న రెడ్డిపోగు భాస్కర్ ను వెంబడించగా తప్పించుకొనే ప్రయత్నంలో బైకును వదిలి వెళుతుండగా వదిలిన బైకును మూడుసార్లు బెలేరో వాహనం తో గుద్ది మళ్లీ మారణాయుధం తో వెంబడించి హత్య చేయబోయే ప్రయత్నం చేయగా అక్కడ నుండి పోలీసులకు సమాచారం ఇవ్వడం తో నిందితుడు పారిపోయి పరారీలో ఉన్నట్లు సమాచారం .. ఫిర్యాదు తీసుకున్న పోలీసులు ౯జ౯ు కేసు నమోదు ఖీ×= చేసినారన్న విషయం భాస్కర్ అన్న ద్వారా తెలుసుకోవడం జరిగింది అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లడి ధైర్యం చెప్పి జాగ్రత్తగా ఉండమని ఎక్కడికి వెళ్ళినా పోలీసులకు ముందస్తుగా సమాచారం ఇచ్చి వెళ్లమని కోరడం జరిగింది .

నిందితులను కఠినంగా శిక్షచాలి :కర్నూలు జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు రెడ్డిపోగు భాస్కర్ పై హత్యా



ప్రయత్నం చేసిన నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఎమ్మిగనూరు ఎమ్మిగనూరు అధ్యక్షుడు కడిమెట్ల గిడ్డయ్య మాదిగ , ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు , మంత్రాలయం నియోజకవర్గం కో ఇన్చార్జ్ ముగతి ప్రతాప్ కుమార్ మాదిగ డిమాండ్ చేశారు .

# రెడ్డిపోగు భాస్కర్.ని పరామర్శించినఎమ్మార్పీఎస్ నాయకులు

## వెల్దుర్తి మండలం కలుగొట్లగ్రామానికివెళ్లినఎమ్మిగనూరు టీం ..

ఎమ్మిగనూరు ఫిబ్రవరి 26

కర్నూలు జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు రెడ్డిపోగు భాస్కర్ అన్నపై హత్యాయత్నం జరిగిన విషయం తెలిసిందే నిన్న ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడ సమీపంలోహత్యాయత్నం లో తప్పించుకొని ప్రాణాపాయం నుండి బయటపడిన కర్నూలు జిల్లా అధ్యక్షులు రెడ్డిపోగు భాస్కర్ అన్నను నేడు వారి స్వగ్రామం కలుగొట్లలో ఎమ్మిగనూరు వీ౯రూ టీం మంత్రాలయం నియోజకవర్గం కో ఇన్చార్జ్ ముగతి ప్రతాప్ కుమార్ మాదిగ , ఎమ్మిగనూరు ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు కడిమెట్ల గిడ్డయ్య మాదిగ , ఎమ్మిగనూరు మండల ఉపాధ్యక్షులు నాగలాపురం రాజుమాదిగపరామర్శించడం జరిగింది .

నిన్న బైక్ పై కర్నూలు వెళ్తున్న రెడ్డిపోగు భాస్కర్ ను వెంబడించగా తప్పించుకొనే ప్రయత్నంలో బైకును వదిలి వెళుతుండగా వదిలిన బైకును మూడుసార్లు బెలేరో వాహనం తో గుద్ది మళ్లీ మారణాయుధం తో



వెంబడించి హత్య చేయబోయే ప్రయత్నం చేయగా అక్కడ నుండి పోలీసులకు సమాచారం ఇవ్వడం తో నిందితుడు పారిపోయి పరారీలో ఉన్నట్లు సమాచారం .. ఫిర్యాదు తీసుకున్న పోలీసులు ౯జ౯ు కేసు నమోదు ఖీ×= చేసినారన్న విషయం భాస్కర్ అన్న ద్వారా తెలుసుకోవడం జరిగింది అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లడి ధైర్యం చెప్పి జాగ్రత్తగా ఉండమని ఎక్కడికి వెళ్ళినా పోలీసులకు ముందస్తుగా సమాచారం ఇచ్చి వెళ్లమని కోరడం జరిగింది .

నిందితులను కఠినంగా శిక్షచాలి :కర్నూలు జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు రెడ్డిపోగు భాస్కర్ పై హత్యా ప్రయత్నం చేసిన నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఎమ్మిగనూరు ఎమ్మిగనూరు అధ్యక్షుడు కడిమెట్ల గిడ్డయ్య మాదిగ , ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు , మంత్రాలయం నియోజకవర్గం కో ఇన్చార్జ్ ముగతి ప్రతాప్ కుమార్ మాదిగ డిమాండ్ చేశారు .




# మార్చ్ 14 న జాతీయ లోక్ అదాలత్

విజేత, (తాడేపల్లిగూడెం) పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో:

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మార్చి 14 తేదీ రెండో శనివారం తాడేపల్లిగూడెం కోర్ట్ ల సముదాయంలో జాతీయ లోక్ అదాలత్ నర్వహించనున్నట్టు మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ మరియు 11వ అదనపు జిల్లా జడ్జి శ్రీ షేక్ సికిందర్ బాషా తెలియచేశారు. ఈ రోజు తాడేపల్లిగూడెం బార్ అసోసియేషన్ హాల్ లో ఏర్పాటు చేసిన మీటింగ్ లో అదనపు జిల్లా జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్ లో అన్ని కోర్టులలో పెండింగ్ లో ఉన్న రాజి పడదగ్గా క్రిమినల్ కేసులు అన్ని రకాల సివిల్ కేసులు మనోవర్తి, గృహహింస, మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు రాజి చేసుకోవచ్చు అని చెప్పారు. బ్యాంకు మరియు టెలిఫోన్ ప్రీ లిటిగేషన్ కేసులు రాజీ చేసుకోవచ్చు అని తద్వారా కక్షిదారుల సమయం డబ్బు ఆదా అవుతుందని ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి మాధవి , జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి సూర్య కిరణ్ శ్రీ , ఫస్ట్ అడిషనల్ సివిల్ జడ్జి శ్రీమతి లలిత దేవీ, సెకండ్ అడిషనల్ సివిల్ జడ్జి అన్నమణి , బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీ ౫. విజయ కృష్ణ , న్యాయవాదులు పాల్గొన్నారు

# జనసేనకు షాక్

## సొంత గూటికి చేరిన ఎంపీటీసీ



విజేత, (తాడేపల్లిగూడెం) పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో: తాడేపల్లిగూడెం నియోజకవర్గ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. తాడేపల్లిగూ డెం మండల పరిధిలోని వీరంపాలెం, పట్టింపాలెం గ్రామాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీటీసీ జంపల్లి సత్యవతి జనసేన పార్టీని వీడి, తిరిగి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వైయస్సార్సీపి నియోజకవర్గ ఇంచార్జి వడ్డి రఘురామ్ నాయుడు సత్యవతి దంపతులకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున ఎంపీటీసీగా ఘన విజయం సాధించిన సత్యవతి, ఆ తదుపరి కాలంలో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలు ఇతర ఒత్తిళ్ల కారణంగా జనసేనలో చేరాల్సి వచ్చిందని వెల్లడించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలపై ఉన్న అచంచల విశ్వాసం, వడ్డి రఘురామ్ నాయుడు సమర్థవంతమైన నాయకత్వంపై ఉన్న నమ్మకంతోనే తాను తిరిగి సొంత గూటికి చేరుకున్నట్లు ఆమె స్పష్టం చేశారు.పార్టీకి విధేయురాలిగా ఉంటూ, తన పరిధిలోని గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి, సమగ్ర అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని సత్యవతి ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. రానున్న ఎన్నికల్లో తాడేపల్లిగూడెం నియోజకవర్గ గడ్డపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను రెపరెపలాడించడమే లక్ష్యంగా, వడ్డి రఘురామ్ నాయకత్వంలో సైనికురాలిగా పనిచేస్తానని ఆమె ఉద్ఘాటించారు. ఈ చేరికతో స్థానిక వైసీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. పట్టింపాలెం, వీరంపాలెంకు చెందిన వైసీపీ నేతలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి సత్యవతికి అభినందనలు తెలిపారు. ఈ పరిణామం నియోజకవర్గంలో వైసీపీ పట్టును మరింత బలోపేతం చేస్తుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.?

# గుంటూరు కేంద్రీయ విద్యాలయలో కాంట్రాక్టు పద్దతిలో ఉద్యోగాలు

ఎమ్మిగనూరు ఫిబ్రవరి 26 ౯

గుంటూరు నల్లపాడు పిఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ నందు వివిధ సబ్జెక్టులకు సంబంధించి టీచర్ పోస్టులకు కాంట్రాక్టు పద్దతిలో 2026-27 విద్యా సంవత్సరానికి దరఖాస్తులనుఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బొంత శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 న ప్రైమరీ టీచర్స్, బాలవాటిక, కంప్యూటర్ ఇన్స్ట్రక్టర్, స్పోర్ట్స్ కోచ్, ఒకేషనల్ ఇన్స్ట్రక్టర్, నర్సు, ఎడ్యుకేషనల్ కౌన్సిలర్, తెలుగు టీచర్స్ కు మార్చి 2 న పీజీటీ ఇంగ్లీష్, హిందీ, బయాలజీ, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ మరియు టీజీటీ ఇంగ్లీష్, హిందీ, సంస్కృతం, సోషల్, మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టులకు అర్హత కలిగిన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ ప్రతులతో వాక్ ఇన్ ఇంటర్వ్యూ కు హాజరు కావాలని ప్రిన్సిపాల్ కోరారు. ఇతర వివరాలకు పిఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ వెబ్సైట్ https://guntur.kvs.ac.in/ ను సందర్శించాలన్నారు

# డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విశిష్ఠ సేవా రత్న అవార్డుకు రంగయ్య ఎంపిక పట్ల పలువురు హర్షం

### దళిత యస్ సి యస్ టీ బీసీమైనారిటీలసమస్యలపై పోరాటలలో రాష్ట్ర స్థాయి గుర్తింపు

ఎమ్మిగనూరు ఫిబ్రవరి 26 శుభాకాంక్షలు తెలిపిన పలువురు ప్రముఖులు ఉద్యమకారులు సామాజిక వేత్తలుగత నెలలో పెద్దలు మాల్లెల వెంకట్రావ్ మరియు గోళ్ళ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో రాబోయే మాలల భవిష్యత్ కార్యాచరణ గురించి గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయిలో జరిగిన మాలల ఆత్మీయ కలయిక సమావేశంలో జాతీయ స్థాయినాయకులుఉద్యమకారులు వేల సంఖ్య లో పాల్గొని రాబోయే కార్యాచరణ పై దిశ నిర్దేశం చేశారు. ఆ సమావేశానికి ముఖ్య అతిధి గా ఆహ్వానం ఉన్న కొన్ని అనివార్య కారణాల వల్ల హాజరు కాలేకపోయానని రంగయ్య.తెలిపారు.దళిత యస్ సి యస్ టీ బీసీ మైనారిటీ ల సమస్యలపై పోరాట ఉద్యమాలలో రంగయ్య కి రాష్ట్ర స్థాయి గుర్తింపు లభించడం తో రాష్ట్ర స్థాయి అవార్డు కి ఎంపిక అయ్యారు. ఈ విషయం తెలుసుకున్న రాయలసీమ ప్రాంతం దళిత నాయకులు ఉద్యమకారులు రాజకీయ ప్రముఖులు మేధావులు శుభాకాంక్షలుతెలియజేసారు. ఉద్యమాలలో నీతి నిజాయితీ తో పేదలకు అండగా ఎప్పుడు ఉంటామని ఈ గుర్తింపు మరింత బాధ్యతను పెంచింది అని రాష్ట్ర ప్రజలు మాపై చూపిస్తున్న అభిమానం ఎనలేనిది అని ఆ గౌరవం నికాపాడుకోడానికి ప్రాణం పణంగా పెట్టి దళిత కుటుంబం లకు అండగా ఉంటామని రంగయ్య తెలిపారు